
# చాపక్రింద నీళ్లు



శ్రీ తాళ్లూరు నాగేశ్వరరావు

అప్పుడే భోజనం చేసి, డాబా ముందు వరండాలోకి వచ్చాడు సుందరరామయ్య. పచార్లు చేస్తూ చేబ్రోలు పుగాకు చుట్ట చుట్టాడు. ఆ చుట్ట వెలిగించుకుంటూ పడక కుర్చీలో కూర్చున్నాడు. ఆ చుట్ట కాలుస్తూ ఆలోచనలో పడ్డాడు.

వెంకటయ్య వొచ్చేవరకూ ఆలోచిస్తోనే వున్నాడు.

"ఏం బావగారూ! భోజనమైందా?"

"రా! రా! వెంకటయ్యా! ఏమిటి విశేషాలు?" సుందరరామయ్య ఆహ్వానించాడు.

వెంకటయ్య వొచ్చి బెంచీమీద కూర్చున్నాడు నవ్వుతూ.

'ఏవిటి సంగతి?' అన్నట్టు సుందర్రామయ్య వెంకటయ్య వంక చూశాడు. ఆయన అట్లా చూడటం అతనికి బాధగా తోచింది. అయినా ఆ బాధను ముఖంలోనే దాచుకొని, లోకాభిరామాయణం ప్రారంభించాడు. కుటుంబ క్షేమం దగ్గర్నుంచీ, పంటల బాగోగులూ, గ్రామీణ రాజకీయాలూ, పంచాయతీ బోర్డు వ్యవహారాలూ, వూళ్లో పిల్లల చదువులూ అన్నీ చెప్పి, కొసకు, సుందరరామయ్య మనస్సును కదిలించే విషయమొకటి వివరించాడు.

"బావగారూ! నే నన్నానని మీ రెక్కడా అనకుండా వుంటే మీ కో సంగతి మనవి చేస్తాను. రామకోటయ్య లేడూ! పాపం, అసలే మధ్యతరగతివాడు. ధనవంతుడు కావాలనే పట్టుదలతోటి విజయవాడలో వ్యాపారం సాగించాడు. బెడిసికొట్టింది అదృష్టం. చేసిన అప్పులు చేంతాడులై కాళ్లకు చుట్టవేసుకున్నాయి. అప్పులవాళ్లు వెంటబడుతూంటే ముఖం తప్పించుకు తిరుగుతున్నాడు. అయినా తాహతుకు మించిన సాహసమా! ఇంతకూ

రామకోటయ్య తమకేమైనా ఇవ్వాలా?"
సుందరరామయ్యకు గుటకపడలేదు. ఆయన మనిషి నమ్మకంమీద అప్పులు ఇస్తూ ఉంటాడు. అప్పుగా డబ్బు ఇచ్చేటప్పుడు ఆ వ్యక్తియొక్క ఆస్తీ, హోదా, చేసే పనులూ ఇవేమీ చూడడు. అందుచేత కలవరపడడం జరిగింది.
"నిజంగానా! నాకు తెలిదే! వెధవది, నాకు అయిదు వందల వరకూ ఇవ్వాలి. రెండేళ్లు అయింది తీసుకెళ్లి, నా బాకీకి నీళ్లు వొదులుకోవాల్సిందేనా?" అన్నాడు ఆదుర్దాగా.
"నాకేం నమ్మకంలేదు. అసలే మీర ధర్మరాజులు. కాలికింద చీమపడ్డా మీ ప్రాణం గిలగిలలాడుతుంది. మీరు వసూలు చేయగలరా?" అన్నాడు వెంకటయ్య.
"చూస్తాను. నమ్మకద్రోహం చేసేవాళ్లమీద నా కెప్పుడూ దయా, జాలీ లేదు. బాకీ చెల్లుపెట్టకపోతే అంతు తేలుస్తాను!" ఆవేశపడ్డాడు సుందరరామయ్య.
నిశ్శబ్దంగా కూర్చున్నాడు వెంకటయ్య.
కమతగాణ్ణి పిలిచి, ఉన్నపళంగా రామకోటయ్యని పిల్చుకురమ్మని పంపించాడు సుందరరామయ్య.
వెంకటయ్య పిల్లికి పంగనామాలు పెట్టినట్టుగా కూర్చున్నాడు. సుదరరామయ్య పచార్లు చేస్తున్నాడు. ఆవేశం సద్దుమణగకపోగా.
"బావగారూ!" దీర్ఘం తీశాడు వెంకటయ్య.
"ఏం వెంకటయ్యా!"
"నాలుగు రోజుల క్రితం అబ్బాయి దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది. మా ఆవిడ వారం రోజుల్నుంచీ మలేరియాతో తీసుకుంటోంది. ఉన్న రెండెకరాల మాగాణి తగిన ఎరువులు లేక ఎండిపోతున్నది. ఈ ఇబ్బందులు సర్దుబాటు కావాలంటే, బావగారూ! మీ సహాయం ఏంతైనా అవసరం. ఒక్క రెండువందలు చేబదులుగానైనా, నోటుపూర్వకంగానైనా తమరు దయచేయాలి!" అన్నాడు వెంకటయ్య ప్రాథేయపడుతూ.
సుందరరామయ్య ఆలోచించాడు.
"ఇదివరకటి బాకీ అలాగే ఉంది వెంకటయ్యా!"
"అదీ ఇదీ కలిపి కొత్త వడ్లు వొచ్చేప్పటికి వడ్డీతో సహా తీర్చివేయనూ!" అన్నాడు వెంకటయ్య.
రెండు వందల రూపాయలు చేబదులుగానే ఇచ్చాడు సుందరరామయ్య. సంతోషంగా వెళ్లాడు వెంకటయ్య.

వెంకటయ్య వెళ్లిన అయిదు నిమిషాలకే రామకోటయ్య వొచ్చాడు. సుందరరామయ్య అతనికేసి వింతగా చూశాడు. ఆ చూపు అతనికి అర్థం కాలేదు.
"నేనే వద్దామనుకుంటున్నాను బావా! ఇంతలో నువ్వు కబురు జేశావు, అంతే!" అంటూ రామకోటయ్య జేబులోంచి పైకం తీశాడు.
సుందరరామయ్య అదిరిపోయాడు.
"బావా! బాకీ పైసలు ఇచ్చేద్దామని వచ్చాను. మొన్ననే పైకం అందింది. కాస్త ఆ నోటు చూసి వడ్డీతో సహా ఏంత రావాలో చెబుదురూ!" అన్నాడు రామకోటయ్య.
ముఖంమీద చన్నీళ్లు చల్లినట్లయింది సుందరరామయ్యకు. రామకోటయ్యకు ఆ డబ్బు ఎక్కడిదో అర్థం కాలేదు. నోట్లు లెక్కజూస్తూ అన్నాడు
"అయితే రామకోటయ్యా! నువ్వేదో వ్యాపారం చేస్తున్నావనీ, అందులో బాగా నష్టం వచ్చిందనీ, బాకీలు చెల్లించటానికి బాధపడుతున్నావని ... విన్నాను. నిజమేనా?"
రామకోటయ్య ఆ మాటలకు కలవరపడ్డాడు. అతని ముఖంలోని ఆశ్చర్యాన్ని సుందరరామయ్య గ్రహించాడు.
"వొట్టిది బావా! అసలు నాకు వ్యాపారమేమిటి? మా బావమరిది బెజవాడలో వ్యాపారం పెడితే, నేనే వాడికి డబ్బు పోగుజేసి ఇచ్చాను. అయినా, వాడు వ్యాపారంలో ఏమీ నష్టపడలేదే! వాడు డబ్బు ఇస్తుంటేనేగా నేను ఒక్కొక్క బాకీ తీరుస్తున్నాను!" అన్నాడు రామకోటయ్య.
సుందరరామయ్యకు చెంపమీద ఛెళ్లున

**అప్పటి ప్రముఖ రచయిత తాళ్లూరి నాగేశ్వర రావుగారు రచించిన ఈ 'చాపక్రింద నీళ్లు' కథ ... ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1958 డిసెంబరు 3 సంచికలో ప్రచురితమయింది.**

కొట్టినట్లయింది. మాట్లాడకుండా నోట్లు లెక్కచూసి, వడ్డీతో సహా డబ్బు తీసుకున్నాడు.
"వస్తాను, బావా!" అని రామకోటయ్య పైపంచ భుజాన వేసుకుని వెళ్లాడు.

సుందరరామయ్య కుర్చీలో అలానే కూర్చున్నాడు ఆలోచిస్తూ. వెంకటయ్య తనతో అబద్ధం ఎందుకాడినట్టు? అబద్ధం కాకపోతే, రామకోటయ్య ఇంత సులభంగ డబ్బు చెల్లించగలడా? తను మోసపోయాడు.
వెకటయ్య 'మాయ'ను అర్థం చేసుకోలేకపోయాడు. వెంకటయ్య ఎత్తుగడను కానలేకపోయాడు. తన్ను తెలివితక్కువవాడిగా నిరూపించాడు.
రామకోటయ్యమీద తన మనసును మళ్లించి, ఆ ఆదుర్దాలో ఉన్న తనవద్దనుంచి పైకం చేబదులుగా పుచ్చుకెళ్లాడు. లేకపోతే, పాతబాకీ చెల్లించని అతను తనవద్ద దమ్మిడీ పుచ్చుకోగలడా? ఎంత పని చేశాడు వెంకటయ్య!
అనుకుంటూ ఉండగానే ఇంటిపక్క సూరయ్య కొడుకు సుబ్రహ్మణ్యం వచ్చాడు చిరునవ్వు నవ్వుతూ. పేపరు చూసిపోవడానికి అతను నిత్యమూ వస్తూ ఉంటాడు.
సుబ్రహ్మణ్యం ముఖాన నవ్వు చూసి, "ఎందుకురా నవ్వుతావు?" అన్నాడు సుందరరామయ్య.
"ఏం లేదు, పెదనాన్నా!" అంటూ బెంచీమీద కూర్చున్నాడు.
"చెప్పరా, విషయమేమిటో ...?"
"ఇప్పుడే బజారునుంచి వస్తున్నాను. చేతులకు బేడీలు తగిలించబోయే సమయంలో ఇట్టే తప్పుకున్నాడు వెంకటయ్య!"
"అదేవిటిరా...?" ఉలిక్కిపడ్డాడు సుందరరామయ్య.
"నీకు తెలియదా ఏమిటి? బస్తీలో అయిదేళ్ల క్రితం ఒక గుడ్డల కొట్లో బాకీ చేశాడు వెంకటయ్య. ఎప్పటికీ తీర్చడట. అది కోర్టుకెక్కి, డిక్రీ అయి, చివరకు అరెస్టు వారెంటు కూడా తెచ్చాడు ఆ గుడ్డలకొట్టు యజమాని. పోలీసులు ఇంటిని చుట్టుముట్టారు. పెరటి దొడ్డి ద్వారా బయటకెళ్లి, ఎక్కడ తెచ్చాడో, ఏమిటో కొంత డబ్బు తెచ్చి కట్టాడు. మిగతాది త్వరలో ఇస్తానని మొరపెట్టుకున్నాడు. ఎట్లానైతేనేం చేతులకు సంకెళ్లు పడే కాలం తప్పింది. ఇంతకూ ఎవరిచ్చారో ఆ డబ్బు?" అన్నాడు సూరయ్య కొడుకు సుబ్రహ్మణ్యం.
సుందరరామయ్య కుక్కిన పేనులాగా మాట్లాడలేదు.
■